సాక్షి
మంచిర్యాల

శనివారం, 8, జూలై, 2023



క్వారీ జాతరకు వేళాయె

క్వారీలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జాతర నిర్వహించనున్నారు. జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు దర్శనానికి తరలి వస్తారు. 8లో▸

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పాతమంచిర్యాల: వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కుటుంబ నియంత్రణ శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, ప్రోగ్రాం అధికారులు నీరజ, అనిత, ఫయాజ్‌ఖాన్, ప్రశాంతి పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైకుంఠధామాల్లో నీటి సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: జిల్లాలోని పురపాలిక సంఘాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైకుంఠధామాలలో నీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. వర్షాకాలం కావడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన తాగునీరు అందించాలని సూచించారు. పైపులైన్లు దెబ్బతిన్న చోట యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి తాగునీటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సీఈ జ్ఞానకుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ ఈఈలు అంజన్‌రావు, మధుసూదన్, డీఈలు, ఏఈలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

'సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి'



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోటపల్లి: సీఎం కేసీఆర్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్ బబ్బరుచెల్క, అన్నారం, వెలమపల్లి గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులను ఆమె మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీపీ మంత్రి సురేఖతో కలిసి ప్రారంభించారు. తెలంగాణ ఏర్పడ్డాక పల్లెలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుతో పల్లె పాలన మరింత చేరువైందని పేర్కొన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ సాంబగౌడ్, సర్పంచ్‌లు పానెం శంకర్, శంకరమ్మ, రమేశ్, ఎంపీటీసీలు సంగీత, సరోజన, మండల అధ్యక్షుడు ఓదెలు, నాయకులు విద్యాసాగర్, సమ్మన్న, రామన్న పాల్గొన్నారు.

అరెస్టుకు నిరసనగా సీపీఐ రాస్తారోకో



రాస్తారోకోలో పాల్గొన్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కలపల్లి శ్రీనివాస్‌రావు అరెస్టుకు నిరసనగా శుక్రవారం మంచిర్యాలలో ఆ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ తెలంగాణలో అబద్ధపు విష ప్రచారాలు చేయడానికి, రాజకీయ లబ్ధి కోసం తమ ప్రాంతాన్ని అల్లకల్లోలం చేయొద్దని, నరేంద్ర మోదీ గో బ్యాక్ అని పిలుపునిస్తున్నామని అన్నారు. వరంగల్‌లో శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న సాంబశివరావు, శ్రీనివాస్‌రావులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలీందర్ ఆలీఖాన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, నాయకులు జోగుల మల్లయ్య, లింగం రవి, మిర్యాల రాజేశ్వర్‌రావు, వనం సత్యనారాయణ పాల్గొన్నారు.

13టీఎంసీలకు చేరిన 'ఎల్లంపల్లి' నీటిమట్టం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీవాగు, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ జలకళ సంతరించుకుంటున్నాయి. ముల్కల్లలోని ర్యాలీవాగు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 408.588 మిలియన్ క్యూబిక్ ఫీట్ల(4730 క్యూసెక్కులు) పూర్తి నీటి మట్టంతో ఉంది. ప్రాజెక్ట్‌కు 20 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ఒక్కరోజు వ్యవధిలోనే రెండు పెరిగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను శుక్రవారం రాత్రి వరకు 13.005 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో 10వేల కూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుండగా.. నంది పంప్‌హౌజ్‌కు 6,300 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వార్క్స్ పథకానికి 331 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉంది.

జంక్షన్లు జామ్ !



- నిర్మాణ పనుల జాప్యంతో అవస్థలు
- జిల్లా కేంద్రంలో నాలుగు చౌరస్తాల్లో తిప్పలు
- డిజైన్ల మార్పుతో నిలిచిన పనులు
- రోజువారీగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ఇది ఐబీ చౌరస్తా కూడలి. జిల్లా కేంద్రంలోని భారీ వాహనాలతోపాటు జిల్లా గుండా ప్రయాణించే వారికి ఇదే ప్రధాన మార్గంగా ఉంది. లక్సెట్టిపేట వైపు నుంచి అటు ఆసిఫాబాద్, నస్పూర్, శ్రీరాంపూర్, గోదావరిఖని, చెన్నూరు వెళ్లేవారు ఈ కూడలి దాటే వెళ్తుంటారు. ఇక్కడ జంక్షన్ నిర్మాణంతో రోడ్డు ఇరుకుగా మారింది. అంతకుముందు ఐబీ పక్కనే హనుమాన్ విగ్రహం వద్ద మంచి మంచిర్యాల లోగో ఏర్పాటు చేసి, తొలగించారు. ఇక్కడ రోడ్డు ఎగుడు దిగుడుగా ఉంది. వాహనాలు సర్కిల్ చుట్టూ తిరిగేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ప్రధాన కూడళ్లలో చేపట్టిన జంక్షన్ల నిర్మాణాల్లో జాప్యం జరుగుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మంచిర్యాల పట్టణానికి ఒకే ప్రధాన రహదారిపై నాలుగు చోట్ల పనులు కొనసాగుతుండడంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఐబీ చౌరస్తా, వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ టాకీస్ చౌరస్తాల వద్ద రూ.4కోట్లతో ఈ జంక్షన్ల నిర్మాణం సాగుతోంది. రోడ్డు విస్తరణ చేయకుండానే సర్కిళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 132ఫీట్ల రోడ్డుగా ఉన్న మధ్యలో సర్కిల్ నిర్మాణం చేపట్టారు. పట్టణ సుందరీకరణలో భాగంగా మున్సిపాలిటీ ఈ పనులు చేపడుతోంది. తాజాగా సర్కిల్ లోపల ఏర్పాటు చేయనున్న సుందరీకరణ నిర్మాణాల డిజైన్లు ఖరారు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో కూడళ్ల వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేసవిలో తీవ్ర దుమ్ము ధూళితో ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం కూడళ్ల వద్ద కరెంట్ స్తంభాలు, మురికికాలువలు, డివైడర్ల తొలగింపు అలాగే ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.



ఇది మంచిర్యాల పట్టణం బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్, బెల్లంపల్లి, ఐబీ చౌరస్తా వైపు రాకపోకలు సాగించే రోడ్డుపై ఉన్న ప్రధాన కూడలి. ఇక్కడ చేపట్టిన జంక్షన్ నిర్మాణంతో గత కొద్దీ రోజులుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడున్న రోడ్డుకు సుందరీకరణలో భాగంగా కూడలి నిర్మించేందుకు రోడ్డు మధ్యలో తవ్వి చుట్టూ సిమెంట్ గోడ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పనులు ఆగిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తున్న బస్సులు వచ్చేటప్పుడు సర్కిల్ చుట్టూ తిరిగి వెళ్లేటప్పుడు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఓ వైపు ఈ నిర్మాణంతో గతంలో ఉన్న రోడ్ల విస్తీర్ణం తగ్గిపోయింది. వాహనాలు ఉన్న రోడ్డులోనే ఇరుకుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థకు ఆటంకం కలుగుతుండడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించే వారు తిప్పలు పడుతున్నారు. మరో వైపు బైపాస్ రోడ్డు తెలంగాణ చౌరస్తా వెళ్లే రోడ్డు పరిహారం వివాదంతో రాకపోకలు సాగించే వైపే ఫెన్సింగ్ పోల్స్ వేయడంతో అటు వైపు మరింత అసౌకర్యంగా మారింది.



ఇది వెంకటేశ్వర టాకీస్ వద్ద ఉన్న చౌరస్తా. ఇక్కడ కూడా జంక్షన్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన నిర్మాణమైన సర్కిల్ పూర్తయింది. దీంతో గతంలో ఉన్న రోడ్డు కాస్త ఇరుకుగా మారింది. దీంతో అటు మార్కెట్ వైపు.. ఇటు ఐబీ, బెల్లంపల్లి చౌరస్తా, అటు బైపాస్ రోడ్డు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక్కడ టీటీడీ కల్యాణమండపం, పెట్రోల్ బంక్ వైపు రోడ్డు మరింత ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు అటు వైపు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇబ్బంది పడుతున్నారు.



ఇది లక్ష్మీ టాకీస్ వద్ద చేపట్టిన జంక్షన్. జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు కలిపే ఈ చౌరస్తా వద్ద నిత్యం భారీ వాహనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడే ఎన్టీ ఆర్ విగ్రహం ఉండడం, బైపాస్ రోడ్డు డివైడ ర్లు నిర్మాణంతో ఇరుకుగా మారింది. రాముని చెరువు వైపు వెళ్లే రోడ్డు సైతం ఇరుకుగా ఉంది. రోడ్డుపైనే గుంతలు ఏర్పడి ఉండడంతో వాటి ని తప్పించబోయి, వాహనదారులు అదుపుతప్పి కింద పడే అవకాశాలు ఉన్నాయి.

పనులు పూర్తి చేస్తాం

కూడళ్ల వద్ద చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేస్తాం. జంక్షన్లలో నిర్మించిన సర్కిల్ లోపల డిజైన్ల మార్పు కోసం కొటేషన్ ప్రక్రియ పూర్తయింది. టెండరు పిలిచి వచ్చే నెలలోపు పనులు పూర్తి చేస్తాం. విద్యుత్ స్తంభాలు తొలగించి, డ్రైనేజీ నిర్మాణాలు, సీసీ రోడ్లు వేయిస్తే, ట్రాఫిక్ ఇబ్బంది తప్పుతుంది.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల

'పది' సప్లిమెంటరీలో 75.54శాతం ఉత్తీర్ణత

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 75.54శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. 1,578 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,192 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 948 మంది బాలురకు గాను 697 మంది, 630 మంది బాలికలకు గాను 495 మంది ఉత్తీర్ణత సాధించారని డీఈవో యాదయ్య తెలిపారు. రీకౌంటింగ్ ఆఫ్ మార్కు(మార్కులు తిరిగి లెక్కింపు)కు విద్యార్థులు సబ్జెక్టుకు రూ.500 చొప్పున ఈ నెల 18వరకు ఎస్‌బీఐ ద్వారా చలానా చెల్లించి దరఖాస్తులను పరీక్షల సంచాలకుల కార్యాలయం(డీజీఈ) హైదరాబాద్‌కు నేరుగా లేదా పోస్టు ద్వారా పంపించాలని తెలిపారు. రీవెరిఫికేషన్, జవాబు పత్రాల నకలు కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పూర్తి చేసిన ఫారమ్‌ను ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరణ సంతకం చేయించి హాల్‌టికెట్ జిరాక్స్ ప్రతితోపాటు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం నమూనా www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 10నుంచి 18వరకు డీఈవో కార్యాలయ కౌంటర్లలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ఇంటర్‌లో..

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలే సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలురు 1,699 మందికి గాను 877(51శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 1,662 మందికి గాను 1217(73శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని డీఐఈవో శైలజ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 1156 మందికి గాను 582(50శాతం) మంది, బాలికలు 870 మందికి గాను 557(64శాతం) మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

రథయాత్ర జయప్రదం చేయండి

జన్నారం: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న పాతపెన్షన్ సాధన సంకల్పయాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు సెర్బూరి సత్యనారాయణ కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రథయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. 23న జిల్లాలో రథయాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు. కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ రవీందర్, ఎంఈవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రతిభావంతులకే ప్రవేశం



బెల్లంపల్లిలోని సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ పాఠశాల

- గురుకుల విద్యాలయ సంస్థల సొసైటీల నిర్ణయం
- ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకు ఇక చెల్లు చీటీ

బెల్లంపల్లి: ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వ గురుకుల విద్యాలయ సంస్థల సొసైటీలు నిర్ణయించాయి. ఇకపై రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సిఫారసులను అనుమతించకుండా ప్రతిభావంతులకు మాత్రమే అడ్మిషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని ఏకాభిప్రాయానికి వచ్చాయి. తాజా నిర్ణయంతో సిఫారసు లేఖలకు చెక్ పడనుండగా.. కష్టపడి చదివి ప్రవేశ పరీక్షలు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మాత్రమే సీటు దక్కనుంది. రాష్ట్రంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, మహాత్మా జ్యోతి భాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఉన్నాయి. జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకులాలు 9, జ్యోతి భాపూలే 8, మైనార్టీ 3, జనరల్ 1, సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలు 9, సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల 1, జనరల్ గురుకుల కళాశాల 1 ఉన్నాయి. ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల సొసైటీలు ఉమ్మడిగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నాయి. మిగతా 6, 7, 8వ తరగతుల బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఇంటర్మీడియెట్, డిగ్రీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి వేర్వేరుగా నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు నిర్వహించి మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్నాయి. భర్తీ కాకుండా మిగిలి ఉన్న సీట్లకు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో సీట్లు కేటాయిస్తున్నారు. ఇకపై సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోరు. ఈ విధానం ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే అమలు కానుంది. ఇప్పటికే ఐదో తరగతిలో ప్రవేశాలకు మొదటి విడత అడ్మిషన్లు పూర్తయ్యాయి. మిగిలిన సీట్లలో రెండో విడత మెరిట్ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.

80శాతం సీట్లు భర్తీ



పాఠశాల స్థాయిలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతోంది. సాధించిన మార్కుల ప్రాతిపదికన విద్యార్థులకు సీటు కేటాయించడం జరుగుతోంది. ఆన్‌లైన్ విధానంలో సదరు విద్యార్థికి పాఠశాల, కళాశాలను ఎంపిక చేసి అడ్మిషన్ పొందాలని సూచిస్తాం. మొదటి విడతలోనే 80 శాతం సీట్లు భర్తీ అవుతున్నాయి. మిగతా 20 శాతం సీట్లు రెండో జాబితాలో పూర్తవుతున్నాయి. సిఫారసు లేఖ ద్వారా అడ్మిషన్ ఇచ్చే అవకాశం లేకుండా పోతోంది. ఇది మంచి పరిణామం.

– కొప్పుల స్వరూపారాణి, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆర్‌సీవో, ఆదిలాబాద్ రీజియన్

టీచర్ల సర్దుబాటు



- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- తీరనున్న ఉపాధ్యాయుల కొరత

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండడం, విద్యా వలంటీర్ల నియామక ప్రక్రియ నిలిచిపోవడం వల్ల రెండేళ్లుగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ సరిపెడుతోంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీకాకపోవడం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ చేయకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో పెద్ద ఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయి. గత ఏడాది కూడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం సత్ఫలితాలు ఇచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌తో టీచర్లను సర్దుబాటు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఎక్కువగా ఉన్నా 136 మంది ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పని సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్) చేశారు. ఇందులో ఎస్జీటీలు 73, ఎస్‌ఏలు 46, తెలుగు 8, హిందీ 8, ఉర్దూ–1 ఉపాధ్యాయుల సర్దుబాబు చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

137మంది..

జిల్లాలో 686 పాఠశాలల్లో 39,439 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2,839 మంది ఉపాధ్యాయ పోస్టులకు గాను 2,322 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 472 పోస్టులు ఖాళీలున్నాయి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించేందుకు సర్దుబాటు చేశారు. ఎంఈవోల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ అనుమతితో అమలు చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేశారు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానంగా బయోసైన్స్, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఏర్పడడంతో పదో తరగతి ఫలితాలపై ప్రభావం చూపకుండా వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద సర్దుబాటు చేశారు. సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నప్పటికీ అందుకనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కొన్ని చోట్ల ఒకరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులతో సర్దుబాటు చేశారు. విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా పని సర్దుబాటు చేశామని, ఖాళీలను అధిగమించేందుకు విద్యార్థులు తక్కువగా ఉండి ఎక్కువగా ఉన్నా ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేశామని డీఈవో యాదయ్య తెలిపారు.

రోడ్ల వెంట మొక్కలు నాటాలి



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

తాండూర్(బెల్లంపల్లి): హరితహారం కార్యక్రమంలో భాగంగా ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో విస్తారంగా మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ సూచించారు. శుక్రవారం తాండూర్ మండలం మాదారం త్రీ గ్రామ పంచాయతీలో హరిత వనాల ప్లాంటేషన్, అచ్చులాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రధాన, అంతర్గత రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటాలని, నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. మాదారం త్రీ గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తపల్లిలో పంచాయతీ భవన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. అచ్చులాపూర్ గ్రామ పంచాయతీలో మల్టీ లేయ ర్ అవెన్యూ ప్లాంటేషన్‌ను సందర్శించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో నందకుమార్, టీఏలు రమేష్, ప్రసాద్, కొత్తపల్లి సర్పంచ్ రజిత పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ ప్రకటించాలి

జన్నారం: జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్ ప్రకటించాలని, ఈ విషయంపై ప్రధాని మోదీ వరంగల్ సభలో ప్రకటన చేయాలని బీసీ ఉద్యమ పోరాట సంఘం రాష్ట్ర కో కన్వీనర్ కొడూరి చంద్రయ్య, జిల్లా కో కన్వీనర్ సర్సయ్య అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జనాభాలో 60శాతం ఉన్న బీసీలు రిజర్వేషన్లలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రధాని చొరవ చూపాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ పోరాట సంఘం జిల్లా కో కన్వీనర్లు కేపీ నర్సింహులు, శ్రీనివాసగౌడ్, లక్ష్మీనారాయణ, భాస్కర్‌గౌడ్, గంగాధర్, లక్ష్మణ్, రవి, రాజన్న, మల్లయ్య, విజయ్, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్
- జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభం

మందమర్రిరూరల్: రాష్ట్రంలో బహుజన రాజ్య స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మందమర్రిలో బీఎస్పీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నీళ్లు, నిధులు, నియామకాలు పేరిట ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో దాచుకొని, నియామకాల పేరిట దోచుకుని ప్రజలకు కన్నీరు మాత్రమే మిగిలించిందని ఆరోపించారు. ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్లు దోచుకుంటున్నారని, కాంట్రాక్ట్ పనుల్లో ఆంధ్రా వారికే కేటాయిస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన సింగరేణి సొమ్మంతా ఇతర జిల్లాల్లోని అభివృద్ధికి కేటాయిస్తూ సింగరేణి పరిసర ప్రాంత అభివృద్ధిని మరిచారని మండిపడ్డారు. బహుజన రాజ్యం వస్తేనే రాష్ట్రంలో దోపిడీ అంతం అవుతుందని, బహుజన రాజ్యం వచ్చే వరకు ప్రతీ గ్రామాన జరుగుతున్న దోపిడీని వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పలువురు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ గుణ, నాయకులు మద్దెల భవాని, అర్చన, రాజేష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలప పట్టివేత



పట్టుబడ్డ కలప, ట్రాక్టర్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ కవ్వాల్ అటవీ సెక్షన్ పరిధిలో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను ఫారెస్ట్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వాల్ నుంచి కలప తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందిని అప్రమత్తం చేయగా, వారు రోడ్డు వద్ద కాపు కాశారు. హాస్టల్ తండా నుంచి కవ్వాల్ మీదుగా వస్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. అందులో నాలుగు టేకు దుంగలు కనిపించాయి. అటవీ అధికారులు ట్రాక్టర్ ఆపడంతోనే డ్రైవర్ పరారయ్యాడు. పట్టుకున్న కలప, ట్రాక్టర్‌ను రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు రేంజ్ అధికారి తెలిపారు. కలప విలువ రూ.70వేలు ఉంటుందని, విచారణలో దేవునిగూడ గ్రామానికి చెందిన వెల్మ రమణారెడ్డి నిందితుడిగా తేలడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో కొంపరి సంజీవ్ ఇల్లు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన సంజీవ్ ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు మంటలు లేచాయి. గమనించిన కుటుంబ సభ్యులు బయటకు వచ్చి గ్రామస్తుల సహకారంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అదుపులోకి రాకపోవడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 40 బస్తాల డీఏపీ, 15 క్వింటాళ్ల వరి ధాన్యం, బట్టలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు సంజీవ్ తెలిపాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మష్కూర్ అలీ, ఎంపీపీ డుబ్బుల నానయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి రూ.3వేల ఆర్థికసాయం, 50కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శుక్రవారం దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అధికారులు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ అల్లావుద్దీన్ మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకొని హాజరు శాతాన్ని పెంచడంలో సహకారం అందించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. గైర్హాజరుతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడతాయని తెలిపారు. సక్రమంగా విధులకు హాజరు కావాల్సిందిగా కోరారు. రక్షణాధికారి సునీల్‌కుమార్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ మినుగు లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ భైరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



సుజాత (ఫైల్)

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన సిలోజు సుజాత తప్పిపోయినట్లు ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. గతనెల 19న తన తల్లి తప్పిపోయినట్లు 21న సిలోజు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఇప్పటివరకు ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చామన ఛాయలో ఉండి సుమారు ఐదు అడుగుల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఆచూకీ లభించిన వారు కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712656571 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

క్వారీ జాతరకు వేళాయె

- రేపు దుర్గాదేవీ ఆలయ వార్షికోత్సవం
- ఆషాఢ జాతరకు తరలిరానున్న జనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎత్తైన కొండలు.. చూడచక్కని రహదారులు.. దట్టమైన అటవీ ప్రాంతం.. అడవి మధ్య అందమైన ఆలయం.. అలసిన మనసులను సేదతీర్చే సుందరమైన పార్కులు.. పక్షుల కిలకిల రావాలు.. అందులో అందమైన నీటి కొలనులు.. వెరసి.. మంచిర్యాల జిల్లాలోని ఎంసీసీ క్వారీ.. దీనికో ప్రత్యేకత ఉంది. ఏటా ఆషాఢంలో క్వారీ గుట్టల్లో దుర్గాదేవీ జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ 52వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గఢ్‌పూర్ పంచాయతీ పరిధిలో ఎంసీసీ (ఏసీసీ) క్వారీ దుర్గాదేవీ జాతర ఈసారి ఆషాఢ మాసంలో 9వ తేదీన ఆదివారం నిర్వహిస్తారు.

ఇదీ.. ప్రాముఖ్యత..

మంచిర్యాలలో ఎంసీసీ (గతంలో ఏసీసీ) సిమెంట్ కంపనీ పేరుతో ఉండేది. ప్రస్తుతం ఈ కంపనీ నిర్వహణ సరిగా లేక మూతపడింది. హాజీపూర్ మండలం గఢ్‌పూర్, ర్యాలీ, చిన్నగోపాల్‌పూర్, నాగారం పంచాయతీలతోపాటు వీటి పరిధిలో పలు గ్రామాలున్నాయి. గుట్టలో లభించే సిమెంట్ రాయితో సిమెంట్ తయారు చేస్తారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు, ప్రాణనష్టం జరుగుతూ ఉంటుంది. ప్రమాదాల నివారణకు కార్మికులు, కంపనీ యాజమాన్యం మైసమ్మ, దుర్గాదేవీ ఆలయాలను ఏర్పాటు చేసి ఏటా పూజలు ఘనంగా నిర్వహిస్తోంది. ఆషాఢంలో దుర్గాదేవీ జాతర నిర్వహిస్తారు. ఎంసీసీ అధికారులు, కంపనీ సిబ్బంది కుటుంబ సమేతంగా వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని రోజంతా ఇక్కడే ఉంటారు. వంట చేసుకుని భోజనాలు తినడం ఆనవాయితీ. దుర్గాదేవీ ఆలయ ఆవరణలో నాగదేవుడు, పోచమ్మదేవీ ఆలయాలు కూడా ఉన్నాయి. జాతరకు మంచిర్యాల, సమీప గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్రకు చెందిన భక్తులు కూడా ఇక్కడి దేవీ దర్శనం కోసం వస్తుంటారు.



ఎంసీసీ క్వారీలోని దుర్గాదేవీ ఆలయం



ఆలయంలో కొలువుదీరిన దుర్గామాత

ఆకట్టుకునే ప్రకృతి అందాలు..

క్వారీ జాతర దట్టమైన అటవీ ప్రాంతం.. క్వారీకి వెళ్లే రహదారి అరుకు లోయ, తిరుపతి కొండలను తలపిస్తోంది. ఎత్తయిన గుట్టల నుంచి తీసిన రహదారి, మూలమలుపులు, పచ్చని చెట్లు ఇలా ఎంతో అందంగా క్వారీ రహదారి ఉంటుంది. ఎంసీసీ యాజమాన్యం గుట్టలపై పార్కుల నిర్మాణం చేపట్టి పిక్నిక్ స్పాట్‌గా మార్చింది. ఆదివారం వచ్చిందంటే చాలు.. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో ఈ అందమైన ప్రాంతానికి వచ్చి సేద తీరుతూ రోజంతా ఉత్సాహంగా గడుపుతారు. క్వారీలోని అటవీ అందాలు, నీటి కొలనులు, పచ్చని పార్కులు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఆలయం పక్కనే పర్యాటకుల కోసం కాలక్షేప మండపం, గదులు ఉండగా చిన్నచిన్న సమావేశాలు, ఫంక్షన్లు కూడా ఇక్కడ జరుపుతూ ఉంటారు.

భారీ పోలీస్ బందోబస్తు

జాతర ఏర్పాట్లలో భాగంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో మంచిర్యాల బస్టాండ్ నుంచి క్వారీ దుర్గాదేవీ ఆలయం వరకు ప్రత్యేక బస్సు నడుపనున్నారు. ప్రైవేట్ వాహనాల్లోనూ భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వస్తారు. మంచిర్యాల ఇన్‌చార్జి డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

వేజ్‌బోర్డుపై టీబీజీకేఎస్ అసత్య ప్రచారం



మాట్లాడుతున్న సీతారామయ్య

రామకృష్ణాపూర్: సింగరేణిలో సాధించిన ఘనతలు చెప్పుకోవడానికి ఏమీలేక వేజ్‌బోర్డుపై టీబీజీకేఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇంక్రిమెంట్‌తో పాటు కార్మికులకు కరెంట్ చార్జీలు లేనందునే జీతాలు బాగా పెరిగాయంటూ టీబీజీకేఎస్ నాయకులు వేజ్‌బోర్డుపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ కాజీపేటకు వస్తున్న సందర్భంగా శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్‌అలీ, ఇప్పకాయల లింగయ్య, ఆంజనేయులు, రాజేశ్వర్‌రావు, సిద్ధం బాపు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి పైనుంచి పడి కూలీ మృతి

సిర్పూర్(టి): రైల్వే బ్రిడ్జి పైనుంచి కిందపడి కూలీ మృతి చెందాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లాకు చెందిన అంకమ్మరావ్ (48) అనే కూలీ సిర్పూర్ (టీ)–మాకిడి రైల్వేస్టేషన్ల మధ్య కొనసాగుతున్న మూడోలైన్ పనులకు వచ్చాడు. శుక్రవారం రైల్వే బ్రిడ్జిపై పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. తోటి కూలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి



ఎస్వోటూ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేవరకూ జాతీయ సంఘాలన్నింటికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు జీ బాలాజీ, బీఎంఎస్ నాయకుడు టీ ఆనంద్ శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా ఎస్వోటూజీఎం ఎం.రఘుకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జూన్ 13న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన సమావేశంలో అన్ని జాతీయ సంఘాలను ఎన్నికలు జరిగేదాకా సమానంగా చూడాలని, కార్మికుల సమస్యలపై చర్చించేందుకు అవకాశం కల్పించాలని ఆయన కంపెనీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ఆదేశాలను అమలు చేస్తూ మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ, తదితర సమావేశాల్లో జాతీయ సంఘాల నాయకులను యాజమాన్యం ఆహ్వానించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహారావు, అఫ్రోజ్‌ఖాన్, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, కే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'నాభర్త ఆచూకీ తెలుపండి'



రాంచందర్ (ఫైల్)

బెల్లంపల్లి: సింగరేణి కార్మికుడైన తన భర్త రాంచందర్ ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన సుదమల్ల అరుణ ఓ ప్రకటనలో వేడుకుంది. మందమర్రి ఏరియా కేకే–5 ఇంక్లైన్ గనిలో తన భర్త బదిలీ ఫిల్లర్‌గా విధులు నిర్వహించేవాడని తెలిపింది. ఏడాది క్రితం ఇంటినుంచి వెళ్లిపోయి ఇంతవరకు రాలేదని పేర్కొంది. బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపింది. తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో వారంక్రితం ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. మద్యానికి బానిసైన తన భర్త గతంలోనూ ఇంటినుంచి వెళ్లిపోగా వెతికి తీసుకువచ్చినట్లు తెలిపింది. తన భర్త ఆచూకీ తెలిసినవారు 8897788223 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని అరుణ వేడుకుంది.

దెబ్బతిన్న బతుకమ్మ వాగు అప్రోచ్‌రోడ్డు

- వంతెనకు పొంచి ఉన్న ముప్పు



కోతకు గురవుతున్న బతుకమ్మవాగు వంతెన అప్రోచ్‌రోడ్డు

చెన్నూర్: నిజామాబాద్–జగ్దల్‌పూర్ 63వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం చింతలపల్లి గ్రామ సమీపంలో గల బతుకమ్మ వాగుపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే వంతెన పూర్తిగా తెగిపోయే ప్రమాదముంది. గతేడాది సెప్టెంబర్ 11న కురిసిన భారీ వర్షానికి అప్రోచ్‌రోడ్డు పూర్తిగా తెగిపోగా కోటపల్లి మండలంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతు చేపట్టి చేతులు దులుపుకొన్నారు. కాగా, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గతంలో తెగిన ప్రాంతంలోనే అప్రోచ్‌రోడ్డు చిన్నగా కోతకు గురైంది. భారీ వర్షాలు కురిస్తే పూర్తిగా తెగిపోయే అవకాశముంది. వంతెన కూడా కుంగిపోయే ప్రమాదముంది. అప్రోచ్ రోడ్డు తెగిపోతే కోటపల్లి మండలంతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు కాళేశ్వరానికి రాకపోకలు నిలిచిపోనున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం

అప్రోచ్‌రోడ్డుకు ఎలాంటి హాని కలగకుండా ఎప్పటికప్పుడు మరమ్మతు చేయిస్తున్నాం. అప్రోచ్‌రోడ్డుతో పాటు అదనపు పనులు చేపట్టేందుకు రూ.9కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. గతేడాది మాదిరిగా రోడ్డు పూర్తిగా తెగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– అమీర్‌పాషా, డీఈ, ఎన్‌హెచ్ 63

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆత్మహత్య



రవీందర్ (ఫైల్)

దండేపల్లి: తన సోదరుడు భూమి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో ఓ వ్యక్తి మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేటకు చెందిన మా దాసు రవీందర్ (48) తన సోదరుడు ప్రభాకర్ వద్ద ఆరేళ్ల క్రితం ఐదున్నర గుంటల భూమిని రూ.5.5 లక్షలకు కొనుగోలు చేశాడు. పూర్తి డబ్బులు చెల్లించిన రవీందర్ పలుసార్లు రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభాకర్‌ను కోరినా వివిధ కారణాలతో జాప్యం చేశాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో కలత చెందిన రవీందర్ గుండెపోటుకు గురయ్యాడు. గుండె ఆపరేషన్ కోసం రూ.7లక్షలు ఖర్చయ్యాయి. ఇటీవలే ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన రవీందర్ ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభాకర్‌ను కోరాడు. భూమి తన పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే విక్రయించి చికిత్స కోసం చేసిన అప్పు తీర్చుతానని చెప్పాడు. కానీ.. ప్రభాకర్ ససేమిరా అనడంతో తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా అతడి భార్య తిరుమల గుర్తించి వెంటనే లక్సెట్టిపేట ఆస్పత్రికి తీసుకెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య తిరుమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈపీ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్లకు బదిలీ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: కంపెనీ వ్యాప్తంగా జూనియర్, సీనియర్ ఈపీ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్లకు బదిలీల కోసం శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కొత్తగూడెం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఈ ప్రక్రియ జరిగింది. శ్రీరాంపూర్ వీటీసీలో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు చెందినవారు పాల్గొన్నారు. మొత్తం 47 మందికి 44 మంది పాల్గొని సీనియార్టీ ప్రకారం వివిధ ఏరియాల్లో పోస్టింగ్‌లు పొందారు. ఏరియా ఎస్వోటూజీఎం కే రఘుకుమార్, డీజీఎం పర్సనల్ పీ అరవిందరావు, వీటీసీ మేనేజర్ కే వెంకటరామారావు, ఐఈడీ ఎస్ఈ కిరణ్‌కుమార్, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల జీవో అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ మధు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్కే–5 గనిపై కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కనీస వేతనాల జీవో అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరి అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం 2017లో ఇచ్చిన కనీస వేతనాల జీవో, రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్‌లో విడుదల చేసిన జీవో నంబర్ 22ను నేటికీ అమలు చేయడం లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోలేదని, సాధారణ ఎన్నికల్లో మాత్రమే ఓట్ల కోసం ఈ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. యూనియన్ నాయకులు దూరం శ్రీనివాస్, దుంపల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య



భీమయ్య (ఫైల్)

తిర్యాణి: కడుపు నొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అర్జున్‌లొద్ది గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్జున్‌లొద్ది గ్రామానికి చెందిన సోముని భీమయ్య (46) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక తరచూ మద్యం సేవిస్తుండేవాడు. మూడు రోజులుగా కడుపునొప్పి తీవ్రం కాగా భరించలేక ఈనెల 6న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అనంతరం బయటకు వెళ్లి తాను పురుగుల మందు తాగానని చెప్పగా వెంటనే అతడిని మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య మైసక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడికి యత్నించిన ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ సాయిబాబా ఆలయ వాచ్‌మన్ తిరుపతిపై దాడికి యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి ఆలయ సమీపంలో వాచ్‌మన్ తిరుపతిపై అకారణంగా ఎండీ మోసిన్, సయ్యద్ సికందర్ రాళ్లతో దాడి చేశారు. దీంతో తిరుపతి చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

భీమారం: భీమారం గ్రామానికి చెందిన బానోత్ భీమ్లానాయక్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించిన పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్లానాయక్ బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్లేదారిలో రూ.13వేల విలువైన తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సదరు సెల్‌ఫోన్‌ను గుర్తించిన ఎస్సై శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అప్పగించారు.

బదిలీ వర్కర్లను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో 190/20040 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్లకు వెంటనే జనరల్ మజ్దూర్ ప్రమోషన్ కల్పిస్తూ పర్మనెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ రాజారెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆర్కే–6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. పర్మనెంట్ చేయడంలో జాప్యం జరగడంతో భవిష్యత్‌లో వారికి వచ్చే సర్వీస్ లింక్డ్ ప్రమోషన్లలో నష్టం జరుగుతుందని చెప్పారు. సీనియార్టీ కూడా కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. కంపెనీకి వచ్చిన లాభాల నుంచి రూ.700 కోట్లను కార్మికులకు పంచుతామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రామగుండంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే మెడికల్ కాలేజీకి రూ.500 కో ట్లు కంపెనీ ఇచ్చిందని, కానీ.. ప్రభుత్వం ఇందులో సింగరేణి వారి కోసం ఐదుశాతం సీట్లు మాత్రమే ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. దీన్ని మరింతగా పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులు సింగరేణి ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, గౌరవాధ్యక్షుడు మిడివెల్లి శంకర్, నాయకులు శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, నరేశ్, సామల శ్రీనివాస్, ఆవునూరి మహేశ్, గంగాధరాచారి, పుష్పాల రవీందర్ పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన ఘటనలో కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని శివయ్య కాలనీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పాఠశాలకు తీసుకువెళ్లేందుకు శివయ్య కాలనీ వరకు వచ్చిన మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సును డ్రైవర్ జాతీయ రహదారిపై నిలిపాడు. ఈ క్రమంలో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న ఓ ఐషర్ వ్యాన్ వెనుక నుంచి స్కూల్ బస్సును ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ మహేందర్ అతివేగం, అజాగ్రత్తతో వాహనం నడపడమే కాకుండా ప్రమాదం తర్వాత పరారవుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్ మహేందర్‌ను పరీక్షించగా మద్యం తాగినట్లు తేలింది. బస్సు యజమాని వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు మహేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

కాగజ్‌నగర్ రూరల్: గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని ఈజ్‌గాం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈజ్‌గాం చౌరస్తా వద్ద పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈజ్‌గాం గ్రామానికి చెందిన తరుణ్ సర్కార్, నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్–10 గ్రామానికి చెందిన బికాస్ సర్కార్ వద్ద కిలోన్నర గంజాయి పట్టుకున్నారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఎస్సై సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో శిఖం భూములు



ఆవుడం గుండ్లచెరువు శిఖం భూమిలో చేపడుతున్న నిర్మాణం

నెన్నెల: మండలంలోని చెరువులు, కుంటలు, కాలువలు, వాగులు చాలా వరకు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. కొందరు అక్రమార్కులు సాగు చేస్తుండగా, మరికొందరు నిర్మాణాలు చేపడుతూ ఆక్రమిస్తున్నారు. నెన్నెల, నందులపల్లి, గన్‌పూర్, గొల్లపల్లి, గుండ్లసోమారం, ఆవుడం గ్రామాల్లోని శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. దీని వల్ల చెరువుల విస్తీర్ణం తగ్గిపోతోంది. మండలంలోని సాగు విస్తీర్ణం సుమారు 30 వేల ఎకరాలకుపైగా ఉంది. అందులో సుమారు 15 వేల ఎకరాలకు చెరువు నీరే ఆధారం. ఆవుడం గుండ్లచెరువు శిఖం భూమిలో కొందరు అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టగా మరికొందరు మామిడి తోటలు పెంచుతున్నారు. గొల్లపల్లిలో ఎర్ర చెరువు శిఖం భూమిని కొందరు కబ్జా చేసుకొని వ్యవసాయం చేస్తున్నారు. నందులపల్లి బొక్కల వాగు శిఖం భూమి కబ్జాకు గురైంది. కొందరు కాలువలను కబ్జా చేసుకొని పంటలు తీస్తున్నారు. నెన్నెల పెద్ద చెరువు 25 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. గుండ్లసోమారం పెద్ద చెరువు శిఖం భూమిని కబ్జా చేసుకొని కొందరు సాగు చేసుకుంటున్నారు. జోగాపూర్ కుడి, ఎడమ కాలువలను ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తప్పవు



ఎవరైనా చెరువులు, కుంటలు కబ్జా చేసి ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులు చేస్తే విచారణ చేపడతాం. సర్వేలు చేయించి హద్దులు ఏర్పాటు చేయిస్తాం. చెరువులు, కుంటలను పరిశీలించాలని సిబ్బందికి ఆదేశాలు ఇస్తాం.

– భూమేశ్వర్, తహసీల్దార్, నెన్నెల

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



వేణుగోపాల్(ఫైల్)

మందమర్రి రూరల్: పట్టణంలోని మొదటి జోన్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి జీడి వేణుగోపాల్(29) శుక్రవారం గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే–5బీ గనిలో ఓవర్‌మన్ వేణుగోపాల్ ఐదు నెలలుగా విధులకు వెళ్లడం లేదు. శుక్రవారం ఇంట్లో కనిపించలేదు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వేణుగోపాల్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో డెడ్‌బాడీ ఉందనే సమాచారంతో అక్కడికి వెళ్లారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.